ఆక్రమణలను తొలగించండి

మున్సిపల్ కమిషనర్‌ను కోరిన పంచవటివాసులు



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న పంచవటి కాలనీ వాసులు

మణికొండ: తమ కాలనీలోని రోడ్లు, ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలను నిర్వహిస్తుండటంతో ట్రాఫిక్ జాంలు ఏర్పడుతున్నాయని, వాటితో పాటు కాలనీలో అదనపు అంతస్తులు నిర్మిస్తు న్నారని చర్యలు తీసుకోవాలని పంచవటి కాలనీవాసులు మున్సిపల్ కమిషనర్ డి. ప్రదీప్‌కుమార్‌ను కోరారు. ఈ సందర్భంగా వారు కాలనీలో పలు రోడ్లు గుంతలమయం అయ్యాయని, వాటికి ప్యాచ్ వర్క్‌లు చేయించాలని బుల్కాపూర్ నాలాలో పూడిక తీయించాలని కోరారు. రాబోయే వర్షాకాలంలో కాలనీ ముంపునకు గురికాకుండా బుల్కాపూర్ నాలా, పందెన్ వాగులలో ఉన్న పూడికను తొలగించాలన్నారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం నాయకులు శ్రీపతిరెడ్డి, వైజీకే మూర్తి, రామసుబ్బారెడ్డి, రవీందర్‌రెడ్డి, లక్ష్మీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్యాటరీలు చోరీ

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మండలంలోని చెట్లపోతారం, గడ్డపోతారం, అల్లీనగర్ గ్రామాల్లో ఇళ్ల బయట ఉన్న వాహనాల నుంచి బ్యాటరీలను గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలిస్తున్నారు. మంగళవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు వాహనాల నుంచి బ్యాటరీలను చోరీ చేస్తుండగా గ్రామస్తులు చూసి వెంబడించారు. వారు దొరకకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. గత రెండు నెలల నుంచి ట్రాక్టర్‌లు, బైక్‌లు ఇతర వాహనాల నుంచి బ్యాటరీలు చోరీకి గురవుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. రాత్రి పూట పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించాలని ఈ సందర్భంగా ప్రజలు కోరుతున్నారు.

కాలువ పనులు పూర్తయితేనే..



వైశాలీనగర్-ఈర్ల చెరువు మురుగు నీటి కాలువ పనులు అసంపూర్తిగా ఉన్న దృశ్యం

హఫీజ్‌పేట్: చెరువులలో మురుగునీరు కలవకుండా ప్రత్యేకంగా చేపట్టిన మురుగునీటి కాలువ పనులు నత్తనడకన జరుగుతున్నాయి. హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని వైశాలీనగర్ నుంచి ఈర్ల చెరువు మీదుగా మదీనాగూడ వైపు సాగాల్సిన కాలువ పనులు ఏళ్లు గడుస్తున్నా ముందుకు సాగడం లేదు. పూర్తి కాకపోవడంపై కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని కాయిదమ్మకుంట నుంచి గురునాథం చెరువు వరకు 70 శాతం పనులు పూర్తికాగా, మదీనాగూడ ఈర్ల చెరువు నుంచి దీప్తిశ్రీనగర్ వరకు మురుగు నీటి కాలువల నిర్మాణం పూర్తి అయ్యాయి. కానీ వైశాలీనగర్ నుంచి ఈర్ల చెరువు వరకు చేపట్టిన పనులు పూర్తికాక పోవడంపై స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు.

- సుమారు రూ.7.41 కోట్లతో మురుగునీటి మళ్లింపు కాలువ నిర్మాణ పనులు చేపట్టారు
- వర్షాకాలం ముంచుకొస్తున్న సందర్భంగా కాలువ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి
- కాలువ ఇరువైపులా సూచికబోర్డులు ఏర్పాటు చేయాలి
- మార్తాండనగర్, ప్రేమ్‌నగర్, మై హోం మంగళ నుంచి మురుగు నీరు ఈర్ల చెరువులోకి వస్తుంది. ఇక చిన్నపాటి వర్షం వస్తే చాలు రైల్వే అండర్ బ్రిడ్జి, వైశాలీనగర్‌లోకి మురుగునీరు చేరుతున్నాయి.
- దీంతో దోమల బెడద తీవ్రంగా ఉందని స్థానికులు వాపోతున్నారు.
- భారీ వరద వస్తే వైశాలీనగర్‌కు రాకపోకలు నిలిచిపోతాయని ఈ ఏడాది భారీ వర్షాలు కురుస్తాయని సూచనల మేరకు అధికారులు తొందరగా పనులు పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

వర్షాకాలం సమీపిస్తోంది

- భారీ వర్షాలు కురిస్తే వైశాలీనగర్‌కు రాకపోకలు బంద్
- నత్తనడకన మురుగునీటి కాలువ పనులు
- వైశాలీనగర్-ఈర్ల చెరువు పనులు త్వరగా పూర్తి చేయాలి

అసంపూర్తి పనులతో ఇబ్బందులు



వైశాలీనగర్ వద్ద చేపట్టిన మురుగు నీటి కాలువ మళ్లింపు పనుల్లో ఆలస్యం జరుగుతోంది. వర్షాకాలం సమీపిస్తుండడంతో కాలువ పనులు వెంటనే పూర్తి చేయాలి.

– కుమార్, స్థానికుడు

త్వరలోనే పనులు పూర్తి చేస్తాం



మురుగు నీటి కాలువ మళ్లింపు పనులు కొంత మేర మిగిలి ఉన్నాయి. ఎప్పటికప్పుడు పనులను పరిశీలిస్తున్నా. త్వరతగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించాను.

– ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ





కాలువలో చెత్త చెదారం, చెట్ల కొమ్మలు



వైశాలినగర్ కాలువ బ్రిడ్జి వద్ద సూచికబోర్డులు లేని దృశ్యం

హెచ్‌ఐసీసీలో సూత్ర ఎగ్జిబిషన్ ప్రారంభం



ఫ్యాషన్ షోను ప్రారంభిస్తున్న నటి రీతు చౌదరి

మాదాపూర్: ప్రముఖ డిజైనర్లు రూపొందించిన వస్త్రాభరణాలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. మాదాపూర్‌లోని హెచ్‌ఐసీసీలో మంగళవారం సూత్ర ఫ్యాషన్ ఎగ్జిబిషన్‌ను నటి రీతు చౌదరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫ్యాషన్ ట్రెండ్‌కు అనుగుణమైన భారతీయ దుస్తులు, డిజైనర్, వెస్ట్రన్ వేర్, ఇండియన్ అప్పరల్, హ్యాండ్‌లూమ్స్, కాస్ట్యూమ్ డిజైనర్, జువెలరీతో పాటు గృహోపకరణాలు, పాదరక్షలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈనెల 30వ తేదీ వరకు ప్రదర్శన కొనసాగుతందని, ప్రదర్శనలో 70 స్టాల్స్‌కు పైగా ఉన్నాయని నిర్వాహకులు ఉమేష్ మాద్యం తెలిపారు.

తొమ్మిదిమందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమాన విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ శ్రావణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.... ఆది, సోమవారాల్లో నిర్వహించిన డ్రైవ్‌లో 09 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను మంగళవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా, జడ్జి ఒక్కొక్కరికి రూ.2 వేల జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

రాష్ట్రంలో విద్యుత్ సమస్య లేదు

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీలో అప్రకటిత విద్యుత్ కోతలు, సమస్యలపై డీఈ ఆపరేషన్ కొండాపూర్ డీజీఎం రాజుతో మంగళవారం టీపీసీసీ కార్యదర్శి గాలి బాలాజీ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గాలి బాలాజీ కరెంటు కోతపై ప్రజలకు వివరణ ఇచ్చారు. గతేడాది విద్యుత్ శాఖ నిర్వహణ పనులకు అనుమతి ఇవ్వలేదని.. దీని కారణంగా చెట్టు కొమ్మలు, ఫ్యూజ్ వైర్లు, పోల్స్ వంటి పనుల నిర్వహణ జరగలేదని అధికారులు తెలిపారన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఈ నిర్వహణ పనులపై దృష్టి పెట్టిందన్నారు. మరమ్మతుల కారణంగా అప్పుడప్పుడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, అంతేకాని రాష్ట్రంలో విద్యుత్ సమస్య లేదని తెలిపారు.

- కూకట్‌పల్లి ప్రజలకు విద్యుత్ సరఫరాపై ఉన్న అపోహలను తొలగించటానికే అధికారుల నుంచి వివరణ తీసుకుంటున్నామని అన్నారు. అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని ఇది ప్రజా ప్రభుత్వమని వివరించారు.

కొండాపూర్‌లో ట్రాఫిక్ జాం



కొండాపూర్ ఆర్టీఏ ఆఫీస్ నుంచి ఫ్లైఓవర్ వరకు బారులుదీరిన వాహనాలు

గచ్చిబౌలి: కొండాపూర్‌లో ట్రాఫిక్ జాం నెలకొంది. ఫ్లైఓవర్‌పైకి వాహనాలను మళ్లించడంతో బారులుదీరాయి. దీంతో వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలలో వెళ్లేందుకు వీలుంటుందని సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ ఫొటోను సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఉదయం సమయంలో మాదాపూర్, గచ్చిబౌలి, నానక్‌రాంగూడ వైపు వెళ్లే ఐటీ ఉద్యోగుల సంఖ్య వేలల్లో ఉంటుంది. ఫ్లై ఓవర్‌పై రెండు వైపులా వాహనాలు వెళ్లే వెసులుబాటు లేకపోవడంతో ట్రాఫిక్ చిక్కులు తప్పడం లేదు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు గచ్చిబౌలి ట్రాఫిక్ పోలీసులు నానా తంటాలు పడుతున్నారు.

ప్రజల ఆరోగ్యంతో ఆటలాడితే చర్యలు

- నార్సింగి మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి
- హోటల్స్, టిఫిన్ సెంటర్ల నిర్వాహకులతో సమావేశం



హోటల్ నిర్వాహకుల సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

మణికొండ: హోటల్‌లు, టిఫిన్ సెంటర్లలో తాజా కూరగాయలు, సరుకులు వాడాలని, నిలువ ఉన్న వస్తువులను వాడితే చర్యలు తప్పవని నార్సింగి మున్సిపల్ కమిషనర్ టి. ప్రవీణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో నార్సింగి, మంచిరేవులలో ఉన్న హోటల్స్, టిఫిన్ సెంటర్ల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని అన్ని హోటల్‌లను తనిఖీ చేస్తామని, ఎవరి వద్దనైనా పాడైన సరుకులు, ప్లాస్టిక్ కవర్‌లు కనిపిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. 120 మైక్రాన్ కన్నా తక్కువ ఉన్న కవర్లను వాడొద్దన్నారు

అప్రమత్తంగా ఉండాలి..

రాబోయే వర్షాకాలంలో రోడ్లపై నీరు, చెత్త చేరి వరద నీరు నిలవకుండా అన్ని వార్డులలో ముందస్తు చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ శానిటేషన్ సూపర్‌వైజర్లు, జవాన్‌లను ఆదేశించారు. మంగళవారం వారితో సమావేశం నిర్వహించి మ్యాన్‌హోల్ వద్ద మట్టి చేరటం, రోడ్ల పక్కన చెత్త నిలువ ఉండటం, ఫుట్‌పాత్‌లపై మట్టి కుప్పలు వెంటనే తొలగించాలన్నారు. వర్షాలకు కూలిపోయే గృహాలు ఉంటే ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. శానిటేషన్ ఇంచార్జి లచ్చిరాం, ఎకోలాస్టిక్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ శ్వేత పాల్గొన్నారు.

ఎన్‌సీసీ వార్షిక శిక్షణ శిబిరం ప్రారంభం



ఎన్‌సీసీ వార్షిక శిక్షణ శిబిరం ప్రారంభోత్సవంలో దానకిషోర్

బంజారాహిల్స్: సైఫాబాద్ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్‌లో పది రోజులపాటు జరిగే ఎన్‌సీసీ వార్షిక శిక్షణ శిబిరం మంగళవారం ప్రారంభమైంది. తెలంగాణ మూడో బెటాలియన్ ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ శరత్ అధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఉస్మానియా యూనివర్సిటీ ఇన్‌చార్జి వైస్‌చాన్సలర్, ప్రిన్సిపాల్ సెక్రటరీ దానకిషోర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్ఎండీఏ ఆవరణలో ఎన్‌సీసీ క్యాంపులు నిర్వహిస్తే అక్కడ మౌలిక వసతులను కల్పించనున్నట్లు చెప్పారు. ఎన్‌సీసీ యూనిఫాం ధరించిన విద్యార్థులు బాధ్యత కలిగిన భావిభారత పౌరులుగా ఎదగాలన్నారు. కళాశాల అభివృద్ధికి సంబంధించి కాలేజ్ బాయ్స్ హాస్టల్‌లో ఓపెన్ జిమ్, పీజీ బ్లాక్ వద్ద గ్రీనరీని కేటాయిస్తామని తెలిపారు. కళాశాలలోని ప్రయోగశాలలకు నిధులు కేటాయించేందుకు సహకరిస్తానన్నారు. ఈ క్యాంపులో పాల్గొన్న క్యాంపస్, అనుబంధ కళాశాలల క్యాడెట్లను ఆయన అభినందించారు. ఉస్మానియా వర్సిటీ రిజిస్ట్రార్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ క్యాడెట్లను అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తున్న ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌నాయక్‌ను ప్రశంసించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌నాయక్, ఎన్‌సీసీ అధికారి డాక్టర్ పల్లటి నరేష్ తదితరులు పాల్గొన్నారు. కాగా ఎన్‌సీసీ వార్షిక శిక్షణ శిబిరాన్ని నిర్వహించడానికి, క్యాడెట్లకు ఇలాంటి అవకాశం కల్పించినందుకు విశ్వవిద్యాలయానికి లెఫ్టినెంట్ కల్నల్ శరత్ కృతజ్ఞతలు తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు



గచ్చిబౌలి: విద్యుత్ మరమ్మతుల కారణంగా బుధవారం సరఫరా నిలిపివేస్తున్నట్లు కొండాపూర్ ఏఈ రాజశేఖర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. హఫీజ్‌పేట్, కొండాపూర్ ఫీడర్ల పరిధిలో.. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు హనుమాన్‌నగర్, భిక్షపతినగర్, గోపాల్‌రెడ్డినగర్, కొండాపూర్ జంక్షన్, ఆర్‌టీఓ ఆఫీస్, అపర్ణ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 2 నుంచి 3.30 గంటల వరకు అపర్ణ అపార్ట్‌మెంట్స్, జూబ్లీ గార్డెన్, మీనాక్షి అపార్ట్‌మెంట్స్, ఎస్‌హెచ్ఎల్ అపార్ట్‌మెంట్స్ తదితర ప్రాంతాలలో విద్యుత్ ఉండదన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

గచ్చిబౌలి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో..

ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రశాంత్‌హిల్స్ కాలనీలో సరఫరాను నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

-11 కేవీ రాయదుర్గం విద్యుత్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు మధురానగర్, రాయదుర్గం పోలీస్‌స్టేషన్, రాయదుర్గం సిగ్నల్స్, బయోడైవర్శిటీ పార్కు ప్రాంతంలో విద్యుత్ ఉండదని తెలిపారు.

హఫీజ్‌పేట్‌లో..

హఫీజ్‌పేట్: హఫీజ్‌పేట్, మదీనాగూడ, పాపిరెడ్డి సబ్‌స్టేషన్ పరిధిలో..

- ఇంద్రారెడ్డి ఆల్విన్ కాలనీ ఫీడర్ పరిధిలో.. ఉదయం 11.00 గంటల నుంచి మధ్యాహ్నం 01.00 గంట వరకు ఇంద్రారెడ్డి ఆల్విన్ కాలనీ, సప్తగిరి కాలనీ, బీహెచ్ఈఎల్ హెచ్ఐజీ, మైత్రీ నగర్ ఫేజ్ 1,2,3 ఏరియాలలో విద్యుత్ ఉండదన్నారు.
- హనుమాన్ టెంపుల్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 2.00 గంటల నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు మదీనాగూడ విలేజ్, ప్రణామ్ హాస్పటల్, మల్లన్న టెంపుల్ ఏరియాలలో ..
- మార్కెట్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 3.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ప్రేమ్‌నగర్ వెనుక వైపు, రోలింగ్ మిడోస్, సీఎం తోట వైపు, 100 ఫీట్ రోడ్డు ఇరువైపులా విద్యుత్ ఉండదని ఏఈ రాజేందర్ తెలిపారు.

వేమన కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో..

హఫీజ్‌పేట్: పీజేఆర్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 11.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పీజేఆర్ ఎన్‌క్లేవ్ రోడ్డు నెంబర్లు 1 నుంచి 7, లగ్జరీ హైట్స్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

- శాంతినగర్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 1.30 గంటల నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు శాంతినగర్, స్వర్ణపురి రోడ్డు, దీప్తిశ్రీనగర్ ఏరియాలలో..
- భవానీపురం ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 3.30 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు భవానీపురం, రెడ్డి కాలనీ, శంకర్‌నగర్ ప్రాంతాలలో..

జాతీయ రహదారి విస్తరణలో భాగంగా...

- భిక్షపతి ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 3.00 గంటల వరకు భిక్షపతి ఎన్‌క్లేవ్ అపార్ట్‌మెంట్స్ ఏరియాలో..
- సురక్ష ఫీడర్ పరిధిలో.. ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 3.00 గంటల వరకు సురక్ష ఏరియా, మోర్ వెనుక వైపు ప్రాంతాలలో విద్యుత్ ఉండదని ఏఈ రాజేందర్ తెలిపారు.

శేరిలింగంపల్లిలో..

శేరిలింగంపల్లి: నల్లగండ్ల హుడా, ఎఫిస్టిమో గ్లోబల్ ఫీడర్ల పరిధిలో..

- 11 కేవీ నల్లగండ్ల హుడా ఫీడర్ పరిధిలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నల్లగండ్ల హుడా కాలనీ, రత్నదీప్ సూపర్ మార్కెట్ వెనుక ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏఈ వెంకటనారాయణ రెడ్డి తెలిపారు.
- 11 కేవీ ఎఫిస్టిమో గ్లోబల్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు ఎఫిస్టిమో గ్లోబల్ స్కూల్, నల్లగండ్ల హుడా కాలనీ, తెల్లాపూర్ మెయిన్ రోడ్లు, సాధన స్కూల్ బ్యాక్‌సైడ్ ఏరియాల్లో ..

తారానగర్ సబ్ స్టేషన్ పరిధిలో..

- 11 కేవీ రామాలయం ఫీడర్ పరిధిలో.. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు హుడా ట్రేడ్ సెంటర్ కాలనీ, రైల్ విహార్, వెంకటరెడ్డి కాలనీ,ఓల్డ్ లింగంపల్లి, లింగంపల్లి రైల్వే స్టేషన్ ప్రాంతాల్లో ..
- 11 కేవీ ఆర్‌జీకే ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు రాజీవ్ గృహకల్పలోని అన్ని బ్లాక్‌లలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏఈ సుమన్ తెలిపారు.

ఆల్విన్‌కాలనీ ఏరియాలో..

ఆల్విన్‌కాలనీ: 11కెవి వెంకటేశ్వరనగర్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 11 నుంచి 12.30 గంటల వరకు కమల ప్రసన్ననగర్, ఫేజ్ 1, వెంకటేశ్వరనగర్, కెఎల్ బార్ ఎదురు ప్రాంతం, వీకర్ సెక్షన్, దీనబంధు కాలనీ

- 11 కెవి మాధవరంనగర్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 1.30 నుంచి 3 గంటల వరకు ఫేజ్ 1, దీనబంధు కాలనీ, మాధవరం నగర్ కాలనీ, కమల ప్రసన్న నగర్
- 11 కెవి ఫీడర్ ఆర్‌పీ కాలనీ పరిధిలో.. మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రామారావునగర్, దీనబంధు కాలనీ, హనుమాన్‌నగర్, రామకృష్ణ నగర్, ఆర్‌పి కాలనీల్లో విద్యుత్ ఉండదని అధికారులు తెలిపారు.

మియాపూర్‌లో..

మియాపూర్: ప్రశాంత్‌నగర్ ఫీడర్ పరిధిలో.. బుధవారం ఉ.11 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ప్రశాంత్‌నగర్, మయూరినగర్ పార్క్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని ఏఈ హరీష్‌సింగ్ ఓ ప్రకటనలో తెలిపారు.

మదీనాగూడ సబ్ స్టేషన్ పరిధిలో...

ఎస్ఆర్ ఎస్టేట్, సత్యనారాయణ ఎన్‌క్లేవ్, లోటస్ కాలనీ, ఫీడర్ల మరమ్మత్తుల కారణంగా ఉ. 11 గంటల నుండి 12.30 గంటల వరకు మియాపూర్ మెయిన్ రోడ్డు, ఫ్రెండ్స్ కాలనీ, ఎస్ఆర్ ఎస్టేట్ అపార్ట్‌మెంట్, మధ్యాహ్నం 1:30 నుండి 3 గంటల వరకు దుర్గా కౌంటీ అపార్ట్‌మెంట్, సత్యనారాయణ ఎన్‌క్లేవ్, జీఎస్ఎం మాల్, అర్చన ఆసుపత్రి, అదేవిధంగా 3.30 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు బొల్లారం రోడ్డు డీ మార్ట్ ఏరియా, నాగార్జునా ఎన్‌క్లేవ్, బస్ బాడి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ రాజ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు.

మాదాపూర్‌లో..

మాదాపూర్: 11కేవీ అయ్యప్ప సొసైటీ ఫీడర్ మరమ్మతుల కారణంగా ఉదయం 11గంటల నుంచి 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు. అయ్యప్పసొసైటీ, స్విమ్మింగ్‌పూల్, రుచి టిఫిన్ సెంటర్ ప్రాంతాలలో..

11కేవి హ్యుందాయ్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు సలీమ్ టీ పాయింట్, ప్రిన్స్ డ్రైవ్ ఇన్ తదితర ప్రాంతాలలో విద్యుత్ ఉండదని తెలిపారు.

ఒకేషనల్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

రాయదుర్గం: తెలంగాణ రాష్ట్రంలో పారామెడికల్ సైన్సెస్‌లో పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సు అందిస్తున్న ఏకైక కేంద్రీయ విశ్వవిద్యాలయం మనూ అని అలైడ్ హెల్త్ అండ్ ఒకేషనల్ సైన్సెస్ విభాగం నోడల్ ఆఫీసర్ ప్రొఫెసర్ మక్బూల్ అహ్మద్ మంగళవారం తెలిపారు .యూనివర్శిటీలో 2023 సంవత్సరంలో మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ అండ్ మెడికల్ ఇమేజింగ్ టెక్నాలజీలో మాస్టర్ ఆఫ్ ఒకేషనల్‌ను ప్రారంభించిందన్నారు. 2024-25 విద్యాసంవత్సరానికి ఎంఎల్‌టీ, ఎంఐటీ కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తోందన్నారు. దరఖాస్తులను సమర్పించడానికి జూన్ 30 ఆఖరు అని తెలిపారు. దరఖాస్తులు, ప్రాస్పెక్టస్ యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్లు ప్రొఫెసర్ ఎస్ మక్బూల్ అహ్మద్(9440366462), డానిష్(9990853997)లో సంప్రదించాలన్నారు.

సామూహిక కుంకుమార్చన



మోతీనగర్: మూసాపేట డివిజన్ మోతీనగర్‌లోని శృంగేరి శారద శంకరమఠం వార్షికోత్సవంలో భాగంగా మంగళవారం శ్రీ శారదాంబకు విశేష అలంకరణ, గోపూజ, సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం నిట్టల కిరణ్మయిచే ప్రవచన కార్యక్రమం జరిగిందని ఆలయ కార్యనిర్వాహక అధికారి సిఎస్ఆర్ మూర్తి తెలిపారు.

ప్రమాదకరంగా మ్యాన్‌హోళ్లు



మియాపూర్ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ రోడ్డులో ధ్వంసమైన మ్యాన్‌హోల్

మియాపూర్: ప్రధాన రోడ్లలో ధ్వంసమైన మ్యాన్‌హోళ్లు ప్రమాదకరంగా మారాయి. మియాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ రోడ్డులో మ్యాన్‌హోళ్ళు ధ్వంసమయ్యాయి. దీంతో ఆ రోడ్డుపై ప్రయాణించే వాహనదారులు ఆ మ్యాన్‌హోళ్లను తప్పించబోయి ప్రమాదాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వీర్ సావర్కర్ జయంతి వేడుకలు



సావర్కర్ చిత్రపటానికి నివాళులు అర్పించిన నాయకులు

ఆల్విన్‌కాలనీ: స్వాతంత్ర్య సమరయోధులు, మాతృభూమి కోసం మరణం కూడా జననం లాంటిది అని చాటి చెప్పిన నాయకుడు, హిందుత్వ సిద్ధాంతకర్త వినాయక్ దామోదర్ వీర్ సావర్కర్ 141 జయంతి సందర్భంగా మంగళవారం అల్లాపూర్ డివిజన్‌లోని వివేకానందనగర్ సెంటర్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అల్లాపూర్ డివిజన్ అధ్యక్షులు విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి బొంత హరికృష్ణ, అంకిత్ సింగ్, శ్రావణ్, సుదర్శన్ ముదిరాజ్, వెంకటరామిరెడ్డి, ఆవుల ఆంజనేయులు, దామోదర్ నేత, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

మంత్రి కొండా సురేఖను కలిసిన నీలం మధు

పటాన్‌చెరు టౌన్: మెదక్ జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖను హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు మర్యాద పూర్వకంగా కలిశారు. వచ్చేనెల 4న పార్లమెంట్ ఎన్నికల ఫలితాల వెల్లడి సందర్భంగా కౌంటింగ్ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ తరపున అవగాహన ఉన్న ఏజెంట్లను నియమించాలని మంత్రి సూచించారు. మెదక్ పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్ పార్టీకి పునర్వైభవం రావడం ఖాయమని, ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం ఖరారైందని మంత్రి ధీమా వ్యక్తం చేసినట్లు మధు తెలిపారు.

స్కూటీని ఢీకొన్న ఆటో

పటాన్‌చెరు టౌన్: ఆటో స్కూటీని ఢీకొట్టిన ఘటనలో వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... హైదరాబాద్ కొండాపూర్‌కు చెందిన వంశీ బాచుపల్లిలోని ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నాడు. కంపెనీ పనిపై సోమవారం బాచుపల్లి నుండి పాశమైలారం వైపు వస్తుండగా అమీన్‌పూర్ మండల పరిధిలోని కిష్టారెడ్డిపేట్ గ్రామ శివారులో కి రాగానే స్కూటీని ఆటో ఢీకొంది.ఈ ఘటనలో వంశీకి తీవ్రగాయాలు కావడంతో చికిత్స కోసం బాచుపల్లిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వంశీ బంధువు హరిచంద్ర ప్రసాద్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అనిల్‌కుమార్‌ను పదవి నుంచి తొలగించాలి

జూనియర్ ఆర్టిస్ట్స్ యూనియన్ సభ్యుడు రవిశంకర్

బంజారాహిల్స్: చిత్రపురి ప్లాట్ల అమ్మకాలతో రూ.200 కోట్లు వెనకేసుకున్న వల్లభనేని అనిల్‌కుమార్‌ను జూనియర్ ఆర్టిస్ట్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పదవి నుంచి వెంటనే తొలగించాలని - జూనియర్ ఆర్టిస్ట్స్ యూనియన్ సభ్యుడు రవిశంకర్ డిమాండ్ చేశారు. చిత్రపురికాలనీ ప్లాట్ల అక్రమాలతో జైలులో ఉన్న చిత్రపురికాలనీ సొసైటీ అధ్యక్షుడు, సినీ జూనియర్ ఆర్టిస్ట్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి వల్లభనేని అనిల్‌కుమార్‌పై చర్యలు తీసుకోవాలంటూ ప్రజావాణిలో గత డిసెంబర్ 29న ఫిర్యాదు చేశానని తెలిపారు. అనిల్‌కుమార్‌ను జూనియర్ ఆర్టిస్ట్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పదవి నుంచి వెంటనే తొలగించాలని, ఇక్కడ కూడా ఎన్నో అక్రమాలు చోటుచేసుకున్నాయని ఆయన ఆరోపించారు. ప్రతినెలా జనరల్ బాడీ మీటింగ్‌లు పెట్టకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరించేవారన్నారు. జూనియర్ ఆర్టిస్ట్‌లకు, లేబర్ కమిషనర్ ఆఫీస్‌కు ఆడిటింగ్ ఇవ్వకుండా అడ్డదారుల్లో జూనియర్ ఆర్టిస్ట్‌లను భయభ్రాంతులకు గురిచేసి ఎన్నికల్లో గెలుస్తూ వచ్చారన్నారు. లేబర్ కమిషనర్‌కు ఎన్నోసార్లు ఫిర్యాదు చేసినా అనిల్‌కుమార్ మాత్రం తన అక్రమ సంపాదనలో కొంతభాగాన్ని అధికారులకు ముట్టజెప్పి చర్యలు తీసుకోకుండా అడ్డుకునేవారన్నారు. దీంతో తాను ప్రజావాణిలో కూడా అర్జీ పెట్టినట్లు వెల్లడించారు. ఇన్నాళ్లకు పోలీసులు స్పందించి అరెస్టు చేయడంతో అక్రమాల గుట్టు రట్టయ్యిందన్నారు. జూనియర్ ఆర్టిస్ట్స్ యూనియన్ నుంచి 1800 బోగస్ కార్డులు తయారుచేసి చిత్రపురికాలనీలో డాక్టర్లు, రియల్‌ఎస్టేట్ వ్యాపారులు, ప్రభుత్వ ఉద్యోగులకు ప్లాట్లు విక్రయించారని, ఈ మొత్తం వ్యవహారంపై దర్యాప్తు చేపట్టాలన్నారు.